వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 277 గురువారం | 16 మే 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




# అమ్మవారి సేవలో ఆర్యవైశ్యులు

ఏడో రోజుకు చేరుకున్న బ్రహ్మోత్సవాలు

8 లో..




వివరాలు 2లో..

# ఏజెన్సీతో.. కుమ్మక్కు

- అడ్డదారిలో లబ్ధి చేకూర్చేందుకు యత్నం
- రూ.70లక్షల చెల్లింపులు
- వారికోసమే రూ.5 కోట్ల ఆక్సిజన్ ప్లాంట్ మూలకు
- జాడ లేని విజిలెన్స్
- పట్టించుకోని అధికారులు




కోవిడ్ లాంటి క్లిష్ట పరిస్థితిలో ఎంతో మందికి ప్రాణవాయువును అందించి వారి ప్రాణాలను కాపాడిన ఆక్సిజన్ ప్లాంట్‌కు అవినీతి చీడ పట్టుకుంది. ప్రైవేట్ ఏజెన్సీతో కుమ్మక్కైన కొంతమంది ఉద్యోగులు రూ.5 కోట్లతో అత్యాధునిక పద్ధతుల్లో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్‌ను మరమ్మతుల పేరిట మూలకు పడేశారు. తమ జేబు నిండితే చాలు ఎవరెక్కడ పోతే తనకేంటి అనుకున్న సదరు ఉద్యోగులు అడ్డదారిలో ప్రైవేట్ ఏజెన్సీ నుంచి పెద్ద మొత్తంలో ఆక్సిజన్ కొనుగోలు చేస్తూ ప్రభుత్వానికి తీవ్ర నష్టం చేస్తున్నారు. ఆసుపత్రిలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాల్సిన విజిలెన్స్ అధికారుల జాడ లేకపోవడం, ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడంతో ఏరియా ఆస్పత్రి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కలెక్టర్ దీనిపై స్పందించి ఆక్సిజన్ ప్లాంట్‌ను పునరుద్ధరించడంతోపాటు ఈ కుంభకోణంలో ప్రత్యేక భూమిక నిర్వహించిన ఉద్యోగులు, ప్రైవేటు ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - వరంగల్ వాయిస్, మహబూబాబాద్



8లో

# ప్రతీ రోజు స్ట్రాంగ్ రూంలను పరిశీలించాలి

రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ఏఆర్ఓలకు ఆదేశాలు జారీ




8లో..

# పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



8లో..

# అమ్మ ఆదర్శ పాఠశాలల.. పనుల్లో వేగం పెంచండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ఆదర్శ పాఠశాలల చైర్ పర్సన్స్, హెచ్ ఎం, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష




# ఏజెన్సీతో కుమ్మక్కు

**అడ్డదారిలో లబ్ధి చేకూర్చేందుకు యత్నం**

**రూ.70లక్షల చెల్లింపులు**

**వారికోసమే రూ.5 కోట్ల ఆక్సీజన్ ప్లాంట్ మూలకు**

**జాడ లేని విజిలెన్స్**

**పట్టించుకోని అధికారులు**




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** అవినీతి అధికారులకు తిమ్మిని బమ్మి చేయడం అలవాటుగా మారింది. ఇదే పరిస్థితి మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్ లో కనిపిస్తోంది. ప్రైవేట్ ఏజెన్సీకి లబ్ధి చేకూర్చేందుకు రూ.5 కోట్లతో అత్యాధునిక పద్దతుల్లో ఏర్పాటు చేసిన ఆక్సీజన్ ప్లాంట్ నే మరమ్మతులు పేరుతో మూలకు పడేశారు. కోవిడ్ సమయంలో వందలాది మందికి ఆక్సిజన్ అందించి వారి ప్రాణాలను కాపాడిన ఈ ఆక్సిజన్ ప్లాంట్ అవినీతి పరుల నిర్లక్ష్యంతో పనికిరాకుండా మారుతోంది. చిన్నపాటి మరమ్మతులతో ఆక్సిజన్ ప్లాంట్ ను తిరిగి వినియోగంలోకి తెచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా అడుగులు పడడం లేదు.

### ఎవరి వాటా ఎంత..?

అధికారుల పర్యవేక్షణ లోపమో లేక ఓ ప్రైవేట్ ఏజెన్సీ పాలిట వరమో తెలియదు గానీ, చిన్న చిన్న మరమ్మత్తులు చేయించడం చేతకాక చేతులెత్తేసిన ఏరియా అస్పత్రి అధికారులు ప్రైవేట్ ఏజెన్సీలకు లబ్ధి చేకూర్చేలా ఆక్సిజన్ సిలిండర్ల కొనుగోలు పేరుతో భారీ కుంభకోణానికి పాల్పడుతున్నట్లు జిల్లా కేంద్రంలో చర్చ నడుస్తోంది. సదరు ఏజెన్సీకి ఇప్పటికే రూ.70లక్షల చెల్లింపులు జరిగినట్లు చెప్పుకొంటున్నారు. ఈ భారీ కుంభకోణంలో కొందరు అధికారులు వాటాల వారీగా పంచుకున్నట్లు పలువురు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.

### ఆక్సిజన్ కిట్లు, బెడ్స్ మాయం..

కోవిడ్ సమయంలో మానుకోట ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో పలువురు ఎన్నారైలు ముందుకు వచ్చి ఆక్సిజన్ కిట్లు, బెడ్స్ అందజేశారు. అయితే అవి నేడు కనిపించడంలేదన్న ప్రచారం సాగుతోంది. భారీ అంచనాలతో ఎంతో మంది రోగులకు ఉపయోగ పడుతుందని ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ ను అధికారులు పట్టించుకోకుండా ఉండడటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఆక్సిజన్ ప్లాంట్ అక్కరకు రాకుండా పోతోందని మండి పడుతున్నారు. కలెక్టర్ దీనిపై స్పందించి తక్షణం మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కుంభకోణానికి బాధ్యులైన ప్రైవేట్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## కృష్ణమాచార్యకు సూర్య సిద్ధాంత రత్న బిరుదు ప్రదానం

**అభినందించిన బంధు మిత్రులు**

**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు, యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం ఆస్థాన సిద్ధాంతి తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతికి జగద్గురు శంకరాచార్య జయంతి రోజైన మే 12 న సికింద్రాబాద్ లోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయంలో జరిగిన వేద సభలో సూర్య సిద్ధాంత రత్న బిరుదును ప్రదానం చేశారు. దీంతో బంధు మిత్రులు, అభిమానులు ఆయనను అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఈ సందర్భంగా కృష్ణమాచార్య సిద్ధాంతి మాట్లాడుతూ జనగామ బాణాపురంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో శ్రీ వేంటేశ్వరస్వామి పరిణయ మహోత్సవంలో భాగంగా ఈ నెల 18 శనివారం సాయంత్రం 6 గంటలకు ఆలయంలో జరిగే బంగారు రథోత్సవం, 108 మంది మహిళా మణులతో మంగళహారతులు సమర్పించే విశేష ఆరాధనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలో భగవత్ బంధువులందరూ పాల్గొని ఈ మహత్కార్యమును తిలకించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని కోరారు. మహిళలు మంగళహారతి తీసుకొని రావాలన్నారు. ఇతర వివరములకు 9849054861 నంబర్ లో సంప్రదించాలన్నారు.

## 18న కన్యకా పరమేశ్వరీ శోభాయాత్ర



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి జన్మ దినం సంగర్భంగా ఈ నెల 18 న శోభా యాత్ర నిర్వహించనున్నట్లు 28వ డివిజన్ కార్పొరేటర్ గందె నవీన్ కల్పన తెలిపారు. ఉదయం 5గంటలనుంచి దేవాలయంలో అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం 5గంటలకు స్టేషన్ రోడ్ లోని పోచమ్మ దేవాలయం సమీపంతో శోభాయాత్ర ప్రారంభమై వరంగల్ చౌరస్తా, జేపీఎన్ రోడ్, పిన్నవారి వీధి, ఇంథెజార్ గంజ్ పోలీస్ స్టేషన్, బట్టల బజార్ మీదుగా వాసవీ మాత దేవాలయానికి చేరుకుంటుందన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మిత్ర బృందం అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధికారి దాచెపల్లి సీతారామ్, మహిళా శిభాగం నాయకులు చొల్లేటి కళావతి, బంధం శిరీష, పరమేశ్వర్, గుండా సంతోష్, పాల మురళి తదితరులు పాల్గొన్నారు.

## పరపతి సంఘాలతో ప్రయోజనం

**కార్పొరేటర్ మరుపల్ల రవి**




**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** పేద, మధ్య తరగతి కుటుంబాలకు పరపతి సంఘాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని 40 డివిజన్ కార్పొరేటర్, భారత్ పరపతి సంఘం గౌరవ అధ్యక్షులు మరుపల్ల రవి అన్నారు. గురువారం నూతనంగా ఏర్పడిన భారత్ పరపతి సంఘం ఆధ్వర్యంలో డ్రా లో వచ్చిన సభ్యులు బత్తిని లలిత, ఓడపెల్లి స్వరాజ్ రాజు, వలుస మేత శ్రీ లకు ఒక్కొక్కరికి 10 గ్రాముల బంగారు బిల్లలను మరుపల్ల రవి చేతుల మీదుగా అందజేశారు. ఇట్టి అప్పు పొందిన వారు రూపాయికి 50 పైసల మిత్తితో ప్రతి నెల సకాలంలో సభ్యులు చెల్లించాలని కోశాధికారి ఎండి యాకుబ్ కోరారు. ఇట్టి డ్రా కార్యక్రమంలో పరపతి సంఘం అధ్యక్షులు వలుస రాజమల్లు, ప్రధాన కార్యదర్శి ఎండి.ఫిరదోస్ ఖాన్, సహాయ కార్యదర్శి ఓడపల్లి అజయ్ బాబు, కోశాధికారి ఎండి.యాకూబ్, ఆర్గనైజర్ కందగట్ల రవి, సభ్యులు దిడ్డి రాజు, ఎండి మక్బూల్, హాఫీజ్ పాల్గొన్నారు.

## రాష్ట్రీయ బాల పురస్కార అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆపదలో ఉన్న బాలబాలికలను రక్షించిన బాలలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యుల నుంచి ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా సంక్షేమ ఆధికారి హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఆవిష్కరణలు, అసాధారణ ప్రతిభా పాటవాలు, ఆటలు, కళలు, సాహిత్యం, సామాజిక సేవ, ధైర్యసాహసాలు తదితర అంశాల్లో అవార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవార్డుల కోసం 5 నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇక స్వచ్ఛంద సంస్థలైతే ఏడేళ్లు ఆపైన బాలబాలికల తరఫున పనిచేస్తూ వారి జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన వారై ఉండాలన్నారు. అర్హులైన వారు https:// awards, gov. in వెబ్ సైట్ లో జులై 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## అంబేద్కర్ విగ్రహాలను తాకితే శిక్ష తప్పదు



**వరంగల్ వాయిస్, పరకాల :** అంబేద్కర్ విగ్రహాలను తాకితే అంబేద్కర్ దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మీకు శిక్ష తప్పదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ హెచ్చరించారు. తిరుపతి జిల్లా, వెంకటగిరి నియోజకవర్గం, వెంకటగిరి టౌన్, క్రాస్ రోడ్, రైల్వే స్టేషన్ పోయే దారిలో ఉన్న బడుగు, బలహీనత వర్గాల అభ్యున్నతికి కృషి చేసినటువంటి, భావి భారత యువతకు ఆదర్శవంతులు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో పాటు తలను ధ్వంసం చేయడం జరిగింది. ఈ ఘాతకానికి పాల్పడిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి హంతకులను చట్టపరంగా శిక్షించాలని కోరారు. దేశవ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాలకు రక్షణ కల్పించాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణిస్తూ తక్షణమే హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## సీపీఐ నేత తిరుపతిరెడ్డిని పరామర్శించిన తాటిపాముల



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీపీఐ సీనియర్ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కూతురు తిరుపతి రెడ్డిని గురువారం హనుమకొండ ఇందిరా నగర్ కాలనీలోని ఆయన స్వగృహంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు తాటిపాముల వెంకట్రాములు కలిసి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం తిరుపతి రెడ్డి 100 సంవత్సరాల వయసులో వృద్ధాప్యంలో ఉన్నప్పటికీ ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ఓపికతో విన్నారు. నిజాం నిరంకుశ పరిపాలనకు, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, దున్నేవాడికి భూమికోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆయన ఆనాడు కరీంనగర్ జిల్లాలో భాగమైన పరకాల ప్రాంతంలో పాల్గొన్నారు. రైతుల వ్యవసాయ కార్మికుల పేద ప్రజల పక్షాన అనేక ఉద్యమాలు నిర్వహించారు. 1972లో ఆయన పరకాల నుంచి శాసనసభకు సీపీఐ అభ్యర్థిగా పోటీ చేశారు. పరకాల తాలూకా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేసి, మండల వ్యవస్థ ఏర్పడిన తర్వాత మొగుళ్లపల్లి మండల సీపీఐ ప్రథమ కార్యదర్శిగా పని చేశారు. ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజా సంక్షేమ కోసం కృషిచేసిన తిరుపతి రెడ్డిని ఆయురారోగ్యాలతోఉండాలని వెంకట్రాములుమనస్ఫూర్తిగా అభినందించారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మండలంలోని బాల్యతండాలో క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పథకం పనులను స్టేట్ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సెక్రటరీ మెంబర్ రాజా రామ్ గురువారం పరిశీలించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో చేపట్టిన పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలతో ముఖాముఖి చర్చించారు. ఎక్కువ మొత్తంలో రోజు కూలి వచ్చేలాగా కూలీలు పనిచేయాలన్నారు. రోజుకు ప్రభుత్వం అందించే రూ.300లను కూలీలు పొందే విధంగా సూచనలు చేశారు. అలాగే గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట జిల్లా అదనపు డీఆర్డీఓ శాంతా కుమారి, అంబుడ్స్ మెన్ అధికారి ఆధామ్, ఎంపీడీవో రేవతి, ఎంపీఓ పూర్ణచందర్ రెడ్డి, ఏపీఓ మంగమ్మ, పంచాయతీ కార్యదర్శి లెనిన్, ఫీల్డ్ అసిస్టెంట్ లు ఉన్నారు.

# పంట వ్యర్థాలను కాల్చొద్దు

### మల్హర్ ఏవో అత్తే సుధాకర్



**వరంగల్ వాయిస్, మల్హర్ :** యాసంగి సీజన్ లో వరి కోతలు పూర్తి అయిన తరువాత పంట వ్యర్థాలను కాల్చ కూడదని మల్హర్ ఏవో అత్తే సుధాకర్ సూచించారు. వ్యవసాయంలో ప్రస్తుతం కూలీల కొరత ఉండటంతో ఎక్కువగా రైతులు వరి కోత యంత్రాలను వినియోగిస్తుండటంతో గడ్డి వినియోగం చాలా వరకు తగ్గిపోయింది. పశు సంపద ఉన్న వారు గడ్డిని సేకరిస్తుండగా మిగతావారు అలాగే పొలంలో వదిలేస్తున్నారు. వానాకాలం పంటకు పొలాన్ని సిద్ధం చేసే క్రమంలో వరి కొయ్యలతో పాటు, గడ్డిని దహనం చేస్తున్నారు. రైతులు అవగాహన లోపంతో చేస్తున్న ఈ చర్యతో భూసారానికి ముప్పు పొంచి ఉందని, వరి కొయ్యలను భూమిలో కలియ దున్నితే అనేక లాభాలు ఉంటాయని వారు తెలిపారు.

### వరి కొయ్యలు కలియ దున్నడం వల్ల కలిగే లాభాలు..

వరి కొయ్యలు నేలలో కలియదున్నడం వల్ల సేంద్రీయ కర్బన శాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం పెరిగే అవకాశం ఉంది. దుక్కి దున్నే సమయంలో సూపర్ ఫాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. వరి కొయ్యలు కలియ దున్నితే ఎకరాకు దాదాపుగా టన్ను ఎరువు తయారవుతుంది. మొక్కలకు 2 శాతం నత్రజని, 4 శాతం పాస్పరస్ అదనంగా లభిస్తుంది. జింక్, మాంగనీసు, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మధాతువులు అంది పంటకు మేలు చేకూర్చుతాయి. నీటి నిల్వ పెరుగుతుంది. కొయ్యకాళ్లను భూమిలో కలియ దున్నితే పోషకాలు తిరిగి నేలకు చేరుతాయి. పొలం దున్నే పది రోజుల ముందు పొలానికి నీరు పెట్టి తర్వాత ఎకరాకు 50 కిలోల సూపర్ పాస్పెట్ చల్లాలి. దీంతో భూమి దెబ్బతినడం నుంచి తప్పించడమే కాకుండా భూమిలో సేంద్రీయ పదార్థాల స్థాయిని పెంచవచ్చు. ఈ పద్ధతి పాటించడం వల్ల నీటి నిల్వ చేసుకునే సామర్థ్యం పెరిగి దిగుబడి అవకాశాలు మెరుగుపడుతాయి.

### నిప్పు పెట్టడం వల్ల కలిగే నష్టాలు..

వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం, దిగుబడి తగ్గిపోతుంది. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతిని మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి. పొలాల్లో తిరిగే పాములు, ముంగీసలు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక రకాల జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు, కల్లాలు దగ్గరే ఉంటే ధాన్యం కాలిపోయే ప్రమాదం ఉంది.

## సమర్థత ఉన్న వారినే వీసీలుగా నియమించాలి

### ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాలకి అనుభవం అర్హత సమర్థత ఉన్న వారిని ఉపకులపతులుగా నియమించాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురువారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ ఈ నెల 21తో ప్రస్తుత ఉపకులపతుల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో కొత్త ఉపకులపతులను నియమించుకోవడానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చినందున, విధేయులను కాకుండా విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయగల వారిని విద్యార్థులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించగల దక్షత కలవారిని ఉపకులపతులుగా నియమించాలని కోరారు. గత ప్రభుత్వం తమ అనుయాయులను, విధేయులను ఉపకులపతులుగా నియమించటం వలన విశ్వవిద్యాలయాలు నిర్వీర్యమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. కాబట్టి, దరఖాస్తు చేసుకున్న 312 మందిలో సమర్థత అనుభవం అర్హత ఉన్న వారిని ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రాజకీయాలతో సంబంధం ఉండి పార్టీ విధేయులను ఉపకులపతులుగా ఎంపిక చేసి విశ్వవిద్యాలయాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చింది కాబట్టి, విశ్వవిద్యాలయాలను ప్రక్షాళన చేయటానికి సమర్థులైన వాళ్లని ఉపకులపతులుగా ఎంపిక చేయాలని అభిప్రాయపడ్డారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, నీటి నిల్వలు పాత్రలలో పూల కుండీలలో లేకుండా జాగ్రత్తలు తీసుకుంటే దోమల బారి నుంచి రక్షించుకొని ప్రాణాంతకమైన డెంగీ లాంటి వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చునని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం హనుమకొండలో జరిగిన ఒక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇంటి పరిసరాలతో పాటు వీధులను కూడా పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలు చెత్తా చెదారాలను ప్లాస్టిక్ బాటిల్ ను మురుగు కాలువలలో వేయకుండా ఉంటూ, ఇళ్లలో తలుపులకు కిటికీలకు జాలీలు అమర్చుకొని దోమల బారిన పడకుండా చూసుకోవాలని ఆయన హితవు పలికారు. పగటి పూట కుట్టే " ఎడిస్ " జాతి మచ్చల దోమల వల్ల డెంగీ వ్యాధి వస్తుందని, తగిన జాగ్రత్తలు తీసుకొని వీటి బారిన పడకుండా ఉండాలని, ఒకవేళ జ్వరం సోకినట్లయితే సొంత చికిత్సల జోలికి పోకుండా నిపుణులైన డాక్టర్ల చే వైద్య సేవలు పొందాలన్నరు. వరంగల్ ఎంజీఎంలో డెంగీ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఒకవేళ డెంగీ జ్వరం వల్ల ప్లేట్లెట్స్ సంఖ్య తగ్గుతున్న కంగారు పడవలసిన అవసరం లేదని, తగిన చికిత్సతో పాటు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకున్నట్లయితే త్వరగా కోలుకోవచ్చని తెలిపారు. ఈ జ్వరానికి మూలమైన దోమల నివారణకు తగిన భద్రతా పద్ధతులు తీసుకోవాలన్నారు.

# జీవనజ్యోతి బీమా చెక్కు అందజేసిన మేనేజర్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని మోత్యా తండా గ్రామానికి చెందిన బాదావత్ నరేష్ గత కొంతకాలం కింద మరణించగా అతను కెనరా బ్యాంక్ అన్నారం షరీఫ్ శాఖలో అకౌంట్ కలిగి ఉండి, కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకంలో 436 రూపాయలు చెల్లించి ఇన్సూరెన్స్ చేయించుకున్నాడు. ఆ ఇన్సూరెన్స్ కు సంబంధించిన బీమా రెండు లక్షల రూపాయలను బ్యాంకు మేనేజర్ రవికిరణ్ గురువారం రోజు నామిని అయిన అతని భార్య బాదావత్ మమతకు అందించారు. ఈ సందర్భంగా మేనేజర్ రవి కిరణ్ మాట్లాడుతూ బ్యాంక్ ఎకౌంటు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వం అందించే ఇన్సూరెన్స్ పథకాలైన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలలో అతి తక్కువ ప్రీమియంతో చెల్లించి సభ్యులుగా చేరాలని, ఈ ఇన్సూరెన్స్ పథకాల వల్ల సహజ మరణం చెందినట్లయితే జీవన్ జ్యోతి పథకం వల్ల రెండు లక్షల రూపాయలు, ప్రమాద మరణం సంభవించినట్లయితే సురక్ష బీమా యోజన పథకం ద్వారా బీమా రూపాయలు రెండు లక్షలు కేంద్ర ప్రభుత్వం వారు అందిస్తున్నారని తెలిపారు. ఈ పథకాలను బ్యాంక్ అకౌంట్ కలిగిన 18 నుంచి 70 సంవత్సరాల వయసు కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. అదే విధంగా బ్యాంకులు అందించే అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన పథకాలను, అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మహేష్, క్లర్క్ తిరుపతి, బ్యాంక్ సిబ్బంది రామస్వామి, రమాదేవి, వర్ధన్నపేట ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు కమలాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# హామీలను అమలు చేయని అసమర్థ సీఎం రేవంత్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయని అసమర్థ సీఎం రేవంత్ రెడ్డి అని హనుమకొండ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్. మారపెల్లి సుధీర్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక చర్యలకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వర్యులు ఆదేశాల ప్రకారం వర్ధన్నపేట నియోజకవర్గంలో అంబేద్కర్ చౌరస్తా రహదారిపై తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక చర్యలకు బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హనుమకొండ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్. మారపెల్లి సుదీర్ కుమార్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలు ముగిసిన తెల్లారే వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇప్పుడు సన్న వడ్ల కు మాత్రమే బోనస్ ఇస్తామనడం రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి వంచించడం, మోసం చేయడం, దగా చేయడమేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారు. ఈ విషయం తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇట్లా ఎట్లా ప్రకటిస్తది.?”అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం ద్వారా తెలంగాణ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి వంచించిందన్నారు. ఓట్లు డబ్బాలో పడంగనే కాంగ్రెస్ వాళ్లకు రైతుల అవసరం తీరింది. అందుకే నాలిక మల్లేసి ఎప్పటి మాదిరిగానే నయవంచనకు పూనుకున్నారు. ఇదే సన్న వడ్లకు మాత్రమే అనే మాట ఎన్నికలకు ముందు గనుక చెప్పింటే కాంగ్రెస్ పార్టీని రైతులు తుక్కు తుక్కు చేసేవాళ్లు. ఇప్పటికీ ప్రజలు ఆగ్రహంతోనే ఉన్నారు. రైతు బంధు ఇయ్యక, రైతు భరోసా ఇయ్యకుండా రైతాంగాన్ని అన్నిరకాలుగా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నమనేని అప్పారావు ఎంపీపీ, మార్గం భిక్షపతి జడ్పీటీసీ, కోమాండ్ల ఎలందర్ రెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్, గుజ్జ సంపత్ రెడ్డి మాజీ వర్ధన్నపేట చైర్మన్, గుజ్జ గోపాల్ రావు, చింతల యాదగిరి మాజీ కార్పొరేటర్, బండి రజిని కుమార్ హసన్ పర్తి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, పోలపెల్లి రామూర్తి, ఏడుదొడ్ల జితేందర్ రెడ్డి పర్వతగిరి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, తుళ్ల కుమారస్వామి వర్ధన్నపేట బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, బోయినపల్లి సోమేశ్వర్ రావు ఎంపీటీసీ, తక్కళ్లపెల్లి చందర్ రావు నందనం సొసైటీ వైస్ చైర్మన్, కరిమిళ్ల దుర్గారావు, రాజమణి కౌన్సిలర్, చిలువేరు కుమారస్వామి, బోట్ల భాస్కర్, పిట్టల రాజు, పంజా మహేష్, దేవేందర్ మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు భారీగా బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

## అన్ని రకాల వరి ధాన్యానికి బోనస్ ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రైతులు పండించిన సన్న రకం, దొడ్డు రకం, మధ్యరకం అన్ని రకాల వరి ధాన్యాలకు బోనస్ ఇవ్వాలని కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మారపల్లి రామచంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరి ధాన్యానికి క్వింటాల్ కు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికై రోజులు గడుస్తున్న కొద్దీ వాగ్దానాల్లో మార్పులు వస్తున్నాయని మండిపడ్డారు. సన్న రకం పండిస్తేనే రూ.500 బోనస్ ఇస్తానని కాంగ్రెస్ పార్టీ ఆరోజు విడుదల చేసిన వాగ్దానంలో లేదన్నరు. నేడు సన్న రకం పండించాలని అనడం భావ్యం కాదని, సన్న రకం వరి ధాన్యం మన వాతావరణం తట్టుకోదు, ఒకవేళ పండించిన అనేక రకాల వ్యాధులు రోగాలు వస్తాయి, దోమపోటుతో ఎకరాలకు ఎకరాల భూమి వరి పంట ధ్వంసం అయిన రోజులు ఉన్నాయని తెలిపారు. కాబట్టి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక రైతుగా ఆలోచించి వరి ధాన్యం పండించిన ప్రతి రైతుకు క్వింటాలకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## నిరుపయోగంగా చెత్త బండ్లు




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** దినదినాభివృద్ధి చెందుతున్న తొర్రూరు మున్సిపాలిటీలో 16 వార్డులు ఉన్నప్పటికీ వార్డులలోని ప్రజలు ప్రతి దినం ఉపయోగిస్తున్న పొడి, తడి చెత్తను మున్సిపాలిటీ సిబ్బంది తరలించడానికి సరైన చెత్త బండ్లు లేక ఇంట్లో పేరుకుపోయిన చెత్త వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు పలువురు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చెత్త సేకరణ కోసం తొర్రూరు మున్సిపాలిటీకి ఎలక్ట్రానిక్ చెత్త బండ్లను మంజూరు చేసినప్పటికీ ఆ బండ్ల ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులలో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ సిబ్బంది సేకరించి, ఆ ఎలక్ట్రానిక్ బండ్ల ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలించడం జరిగింది. ఆ ఎలక్ట్రానిక్ బండ్లు కొన్ని రోజులకే టెక్నికల్ ప్రాబ్లం వల్ల చెడిపోగా, వాటిని ఎలాంటి మరమ్మత్తు చేయకుండా పట్టణంలోని స్థానిక వాటర్ ట్యాంక్ వద్ద నిరుపయోగంగా పక్కకు పెట్టడంతో ప్రభుత్వ, ప్రజాధనాన్ని వృధా చేయడం జరుగుతుందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ఆ నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ చెత్త బండ్లను వెంటనే మరమ్మత్తు చేయించి చెత్త కోసం ఉపయోగించాలని మున్సిపల్ శాఖ అధికారులను కోరుతున్నారు.

## సీసీఐ కొనుగోలు సెంటర్లు ప్రారంభించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీసీఐ కొనుగోలు సెంటర్లను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని వరంగల్ బ్రాంచ్ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండయా లి.మేనేజర్ అర్జున్ దవేను గురువారం తెలంగాణ రైతు సంఘం కమిటీ ఆధ్వర్యంలో కలిసి రైతుల వద్ద నుంచి పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మెమోరండం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య మాట్లాడుతూ రైతులు పండించిన పత్తిని ఎంఎస్ పీ 7020 ఉండగా ప్రైవేట్ వ్యాపారస్తులు కొద్ది రోజుల నుంచి రైతులు మార్కెట్ కు తీసుకొచ్చిన పత్తిని మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీని వలన క్వింటాకు సుమారుగా రూ.500 నుంచి 1000 వరకు రైతులు నష్టపోతున్నారు. సీసీఐ పత్తిని కొనుగోలు చేయకపోవడం వలన రైతులకు నష్టం వాటిల్లుతుందని, రైతులు పండించిన పంట పెట్టుబడి రాలేని పరిస్థితిలో అయోమయంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ఈ పరిస్థితిలో రైతుల వద్ద నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేయవలసిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లి. మార్కెట్లలో సెంటర్లను ప్రారంభించి మద్దతు ధరకు రైతులు తెచ్చిన పత్తిని వెంటనే కొనుగోలు చేపట్టి రైతులను ఆదుకోవాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ బ్రాంచ్ మేనేజర్ ను మద్దతు ధరకు రైతులు తెచ్చిన పత్తిని వెంటనే కొనుగోలు ప్రారంభించాలని వరంగల్ నగరం లక్ష్మీపురం సీసీఐ కార్యాలయంలో కలిసి మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు స్పందించి వెంటనే వరంగల్ ఏనుమాముల మార్కెట్ లో సెంటర్ ను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఊరటి హంశాలు రెడ్డి, జిల్లా కోశాధికారి సిరుల రవీందర్, రైతు సంఘ సభ్యులు జయపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కడియంను కలిసిన జఫర్‌గఢ్ నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక కనకదుర్గ కాలనీలోని ఎమ్మెల్యే కడియం నివాసంలో జఫర్ గడ్ మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిశారు. ఈ సందర్భంగా జఫర్ గడ్ మండల సమస్యలపై మండల నాయకులు ఎమ్మెల్యేతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ కోసం కష్ట పడేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. అలాగే, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాలరాజ్ గౌడ్‌ను సన్మానించిన యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అంబాల రాజు



**వరంగల్ వాయిస్, ఇల్లంతకుంట :** మండల కేంద్రంలో బుధవారం జరిగిన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సమావేశంలో ఇల్లంతకుంట ప్రెస్ క్లబ్ (ఐజేయూ) నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న జక్కే బాలరాజ్ గౌడ్ ను గురువారం జమ్మికుంట మండల యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అంబాల రాజు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అంబాల రాజు మాట్లాడుతూ జక్కే బాలరాజ్ గౌడ్ రానున్న రోజుల్లో పత్రికా రంగంలో మరెన్నో పదవులు అధిరోహించి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు.

## పరిపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యం

### కార్పొరేటర్ పోశాల పద్మ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నిత్యం కుటుంబ బాధ్యతలు, పని ఒత్తిడితో సతమతమయ్యే మహిళలకు యోగ సాధన ఎంతో మేలు చేసి, పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా చేస్తుందని 41వ కార్పొరేటర్ పోశాల పద్మ అన్నారు. హనుమాన్ సేవా సమితి శంభునిపేటలో మహిళల కోసం నిర్వహిస్తున్న వారం రోజుల ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రసంగిస్తూ.. మహిళలు నిత్యం యోగ సాధన చేసి ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పాల్గొని ప్రసంగిస్తూ సనాతన ధర్మం ప్రపంచానికి అందించిన గొప్ప కానుక యోగా అని, నిత్య యోగ సాధనతో చిన్న వయసులోనే వస్తున్న అనేక రోగాలు మటుమాయమై సంపూర్ణ ఆరోగ్యం వస్తుందన్నారు. శిబిరంలో యోగా గురువు అశోక్ ఆర్య మహిళలతో యోగ, ప్రాణాయామం అభ్యాసం చేయించారు. కార్యక్రమంలో దేవులపల్లి శ్రీలత, మిట్టపల్లి రమాదేవి, కొలిపాక సంధ్య, గంగు నాగలక్ష్మి, పెరుమాండ్ల రాధిక, తూముల సంధ్య, కూచన దేవలత, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** డిగ్రీ కళాశాలలో 2024 -25 విద్యా సంవత్సరానికి దోస్తు విధానంలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.రాములు తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. కళాశాలలో బీఎస్సీ డైరీ, బీఎస్సీ సెరికల్చర్, జనరల్, కంప్యూటర్, బీకాం కంప్యూటర్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యా బోధన, ఎన్ఎస్ఎస్ సేవా విభాగం, పోటీ పరీక్షలు ఉద్యోగార్దులకు ప్రత్యేక శిక్షణ, అధునాతన కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ సౌకర్యంతో పాటు ఉపకార వేతనాలు అందించడం జరుగుతుందన్నారు. కళాశాలలో ఉచితంగా దోస్తు ఆన్ లైన్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. అడ్మిషన్ కోసం విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ మెమో, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నెంబర్, ఇంటర్మీడియట్ వరకు బోనఫైడ్ సర్టిఫికెట్లు తమ వెంట తెచ్చుకోవాలన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ పొందాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాల దోస్తు సమన్వయకర్త డి.సునీత 9989749066ను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులుసద్వినియోగపరుచుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## 40వ డివిజన్‌లో కుక్కల పట్టివేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 40వ డివిజన్ లో కుక్కల బెడద విపరీతంగా ఉన్నందున గురువారం మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 12 కుక్కలను పట్టుకెళ్లడం జరిగిందని 40 వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. డివిజన్ లో దాదాపు 400 కుక్కలు వరకు ఉన్నాయని, కుక్కల అరుపులతో రాత్రి వేళలో ప్రజలు నిద్రపోవడం లేదని, కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేసి కరవడం వలన అనేకమంది ఆస్పత్రి పాలవుతున్నారన్నారు. ప్రజలు ఒంటరిగా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. నేటి పరిస్థితులలో పిల్లలను ఒంటరిగా వెళ్లనీయకుండా వారికి తోడుగా కుటుంబ సభ్యులు వెళ్లాలని ప్రజలను కోరారు. ఉర్సు బీసీ హాస్టల్ నుంచి లవ్లీ ఫంక్షన్ హాల్ కు వెళ్లే రహదారిలో మురుగునీటి పైపులైన్లు ఎత్తుగా ఉండటం వలన వాహనాలు సరిగా వెళ్లలేకపోతున్నాయని, మురుగునీరు అంతా అక్కడనే నిలిచి ఉండడం వలన వర్షం వచ్చినప్పుడు నీరంతా ఇండ్లలోకి, ఖాళీ స్థలాల్లోకి వెళు తున్నందున కార్పొరేషన్ జేసీబీతో కార్పొరేటర్ మరుపల్ల రవి పైపులను సరిచేయించారు.

## బాధితుడిని పరామర్శించిన అరూరి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లి గ్రామానికి చెందిన హనుమాన్ దీక్ష స్వామి బుద్దె చంద్రశేఖర్ ఆత్మహత్య యత్నం చేస్కొని ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా గురువారం బీజేపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేష్ హాస్పిటల్ కు వెళ్లి వారిని పరామర్శించి మెరుగైన వైద్యం అందిచాలని హాస్పిటల్ వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొన్న జరిగిన లోక్ సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా గ్రామంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు బుద్దే పెద్దన్న కొంతమంది కలిసి హనుమాన్ మాల మీద ఉన్న చంద్రశేఖర్ ను నోటికి వచ్చినట్టు దుర్భాషలాడటంతో మనస్తాపంతో ఆత్మహత్యా యత్నం చేసుకోగా, వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేయడం జరిగిందని తెలిపారు. పోలీసు శాఖ వారు దీనిపై వెంటనే విచారణ జరిపి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో బాధితుడికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామన్నారు. వీరి వెంట బీజేపీ నాయకులు బుద్దె శ్రీనివాస్, దినేష్, రాజేష్, సాంబయ్య, రవీందర్ రావు, జితేందర్, సతీష్, అనిల్ పాల్గొన్నారు.

## కేయూఎస్డీఎల్సీ సంయుక్త సంచాలకుడిగా గోపినాథ్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ దూర విద్యాకేంద్ర సంయుక్త సంచాలకుడిగా మైక్రో-బయాలజీ విభాగ ఒప్పంద అధ్యాపకుడు డాక్టర్ బి.వి.గోపినాథ్ ను నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీజేశారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ చేతుల మీదగా ఆ ఉత్తర్వులు గోపినాథ్ అందుకున్నారు. ప్రస్తుత సంయుక్త సంచాలకుడు డాక్టర్ పి.కరుణాకర్ నుంచి గోపినాథ్ బాధ్యతలు స్వీకరిస్తారు. డాక్టర్ గోపినాథ్ కాకతీయ యూనివర్సిటీలో 2010వ సంవత్సరంలో పార్ట్ టైం అధ్యాపకుడిగా ప్రవేశించారు. 2013లో ఒప్పంద అధ్యాపకుడిగా పదోన్నతి పొందారు. డాక్టర్ గోపినాద్ 15కు పైగా పత్రాలు వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సులో సబ్మిట్ చేశారు. 2005లో రాజీవ్ గాంధీ నేషనల్ ఫెలో షిప్ కు ఎంపికైన డాక్టర్ గోపినాథ్ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో దూర విద్య సెల్ కోఆర్డినేటర్ గా, మైక్రో బయాలజీ విభాగ ఇంచార్జ్ హెడ్ గా కూడా పని చేశారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అబినందించారు.

## ఆర్యవైశ్య విద్యార్థులకు సత్కారం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో 2024 సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ లో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులైన వరంగల్, హనుమకొండ, కాజీపేటలో ఆర్యవైశ్య విద్యార్థిని విద్యార్థులకు ఆర్యవైశ్య వాసవి మాత పరపతి సంఘం, ఎంజీ రోడ్, వరంగల్ ఆధ్వర్యంలో ప్యూర్ వెండి మెడల్, మేమెంటో, శాలువాతో సత్కరించారు. పరపతి సంఠం అధ్యక్షుడు ఇరుకుల్ల రమేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ఎంత ప్రతిభ ఉన్నా గానీ, రిజర్వేషన్ల అడ్డు కారణంగా ఉన్నత ఉద్యోగాలలో వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలను ప్రోత్సహించేందుకు ఈ సన్మాన కార్యక్రమం చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను, రిటైర్ ఉపాధ్యాయులను సన్మానించారు. సుమారు 50 మంది పిల్లలకు సన్మానం చేసి వారికి దేవస్థాన అర్చకులు రామాచారి, కృష్ణమాచారిచే వేద ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అకినేపల్లి సత్యనారాయణ, బెజుగం రజినీకాంత్, వెలగందుల రమేష్, కుంచం వీరభద్ర రావు, మాజీ మున్సిపల్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ తోట నవీన్, సంఘ కార్యవర్గ సభ్యులు, సంఘ సభ్యులు, పురప్రముఖులు, విద్యావేత్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు, స్థానిక సంస్థలు రెవెన్యూ లెనిన్ వత్సల్ టోప్పో, ఎం.డేవిడ్ తో కలిసి ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై విద్యా, రెవిన్యూ, పోలీస్, వైద్య, పంచాయతీ, మున్సిపల్, విద్యుత్, పోస్టల్, ఆర్టీసి తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి జూన్ 1 వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్నాయని తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిధిలో జిరాక్స్ షాపులను మూసివేసి 144 సెక్షన్ విధించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, పరీక్షా కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాలన్నారు. జిల్లాలో ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్ష నిర్వహణకు 4679 మంది విద్యార్థులకు గాను 16 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు, విధులు నిర్వహించే సిబ్బంది ఎవరికీ పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్ లను, ఎలాక్ట్రానిక్ వస్తువులు తేవడానికి అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. ఆర్టీసి బస్సులు సమయ పాలన పాటించాలని, పోస్టల్ అధికారులు వారికి నిర్దేశించిన నియమనిబంధనలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎస్.సత్యనారాయణ, డీఈఓ రామారావు, ఆర్టీసి డీఎం.శివప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్ఓ అంబరీష్, పంచాయతీ, మునిసిపల్ శాఖ, పోస్టల్ శాఖ, విద్యుత్, పోలీసు శాఖ అధికారులు, కలెక్టరేట్ పరీక్షల విభాగం సూపరింటెండెంట్ భద్రకాళీ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



వరంగల్ వాయిస్, ములుగు : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు గురువారం ములుగు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య స్థానిక ప్రభుత్వ జిల్లా జనరల్ ఆసుపత్రి వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ డెంగీ వ్యాధి, వ్యాధిగ్రస్తమైన ఆడ ఏడిసు, ఈజిప్ట్ దోమ కాటు వలన వస్తుందని, ఇవి పగటిపూట కుడతాయని తెలిపారు. తీవ్రమైన వేడితో కూడిన జ్వరం, భరించలేని తలనొప్పి, కనుగుడ్లు కదిపితే నొప్పి పెట్టడం, చర్మంపై దద్దుర్లు, జ్వరం ఆగకుండా మూడు నుంచి ఐదు రోజులు ఉండటం, కండరాలు, కీళ్ల నొప్పులు అధికంగా ఉండటం, ఇవి డెంగీ వ్యాధి లక్షణాలని, ఇలాంటి లక్షణాలు కనుక ఉన్నట్లయితే మీకు దగ్గరలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని, వైద్యాధికారులచే తగిన చికిత్స పొందాలని తెలిపారు. ఈ సంవత్సరం డెంగీకి సంబంధించిన నినాదం, సమాజంతో మమేకమై డెంగీ వ్యాధి నియంత్రిద్దాం అని జాతీయ కేంద్రక కీటక జనిత వ్యాధుల నియంత్రణ వారు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇంట్లో, ఇంటి చుట్టూ పనికిరాని పాత కూలర్లు, పాత టైర్లు, డ్రమ్ములు, రోలు, కొబ్బరి చిప్పలు పగిలిన కుండలు కాలి సీసాలు, గ్లాసులు లేకుండా చూడాలని, ఇంటి పరిసరాలు చుట్టూ నీరు నిలవకుండా చూసుకోవాలని, ఓవర్ హెడ్ ట్యాంకులపై, ఇండ్లలోని నీరు నిల్వ ఉంచే పాత్రలపై తప్పక మూతలు ఉంచాలని, సెప్టిక్ ట్యాంక్ గాలి గొట్టానికి మెష్ బిగించాలని కోరారు. ర్యాలీ అనంతరం ఆపరేషన్ డెంగీ ప్రతిజ్ఞ వైద్య సిబ్బందితో డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్, జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం డాక్టర్ శ్రీకాంత్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రవీందర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పవన్ కుమార్, కార్యాలయ సిబ్బంది డెమో తిరుపతయ్య, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ దుర్గారావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సంపత్ రావు, హెల్త్ ఎడ్యుకేటర్స్ సంపత్, భాస్కర్, రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవు

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




**వరంగల్ వాయిస్, ములుగు :** రైతులకు కల్తీ విత్తనాలు అమ్మిన , రైతులను మోసం చేసిన సహించేది లేదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర , డీఎస్పీ రవీందర్ లతో కలిసి ములుగు జిల్లాలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లకు విత్తన చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ములుగు జిల్లాలో ప్రజలు ఎక్కువగా వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తుంటారని అలాంటి రైతులకు కల్తీ విత్తనాలు అమ్మినా, మోసం చేసినా సహించేది లేదని జిల్లాలో వ్యవసాయ, పోలీసుశాఖ, జిల్లాలోని విత్తన డీలర్లు సమన్వయంగా పనిచేస్తూ నకిలీ, కల్తీ విత్తనాలు సరఫరా కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం నాట్లు వేసే సమయం లో రైతులందరు విత్తనాల విషయంలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విత్తనాల విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించాలని, వ్యవసాయాధికారులు కూడా రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ వారికి అవసరమైన సలహాలు, సూచనలు చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో రైతులకు నాణ్యమైన విత్తనాల కొనుగోలుపై రైతు వేదికల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి నకిలీ విత్తనాలు విక్రయిస్తే షాపు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులకు పూర్తిస్థాయిలో విత్తనాలపై అవగాహన కల్పించే విధంగా వ్యవసాయశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. కల్తీ విత్తనాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు రైతులకు అందే విధంగా చూడాలన్నారు. జిల్లాలో కల్తీ విత్తనాల విక్రయాలకు ఆస్కారం లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు. జిల్లా పోలీసుశాఖ, వ్యవసాయశాఖ అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేస్తున్నామని , విస్తృత తనిఖీలు నిర్వహించి కల్తీ విత్తనాల విక్రయాలు జిల్లాలో లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. డీలర్లందరూ విత్తన చట్టానికి లోబడి వ్యాపారం నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ విత్తనాలు అమ్మరాదని సూచించారు. విత్తనాల అమ్మకాల విషయంలో దుకాణదారులు కల్తీ విత్తనాలు అమ్మినా, కాలపరిమితి లేని విత్తనాలు అమ్మినా, లైసెన్స్ లేకుండా లేదా లైసెన్స్ రెన్యువల్ చేయకుండా వ్యాపారం చేసినా, చినిగిన సంచుల్లో విత్తనాలు అమ్మినా, విత్తనాల కంపెనీలకు సంబంధించిన లేబుల్స్ సరిగా లేకపోయినా, ధరల పట్టిక రికార్డ్స్ సక్రమంగా రాయకపోయినా, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వకపోయినా, బిల్లులలో లాట్ నెంబర్లు రాయకపోయినా నెలవారి నివేదికలు సంబంధిత అధికారులకు సమర్పించకపోయినా దుకాణా దారుల యజమానులపై విత్తనాల చట్టం 1966 , సీడ్స్ రూల్స్ 1968 , సీడ్ కంట్రోల్ ఆర్డర్ 1983 , మరియు ఈ సి చట్టం 1955 ప్రకారం కేసులు నమోదు చేసి 1 నెల నుండి 7 సంవత్సరాలు వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా ఏడీ కే.శ్రీపాల్, ఏటూరు నాగారం ఏడీ ఎన్.శ్రీధర్, జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులు, సీడ్ డీలర్స్, పురుగు మందుల దుకాణదారుల యజమానులు, ఇతర వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
గురువారం 16, మే 2024
www.warangalvoice.net

# పాఠశాలలు పునః ప్రారంభం నాటికి ఏక రూప దుస్తులు

## జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**వరంగల్ వాయిస్, కాటారం :** పాఠశాలలు పునః ప్రారంభం నాటికి విద్యార్థులకు ఏక రూప దుస్తులు పంపిణీ జరగాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా కాటారం మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య భవనంలో జీవన జ్యోతి మండల సమాఖ్య మహిళ సంఘ సభ్యులు కుడుతున్న విద్యార్థుల ఏక రూప దుస్తుల కుట్టు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫామ్ లు అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. మండలంలోని మొత్తం 49 మండల పాఠశాలలకు గాను 901 మంది బాలురు, 988 మంది బాలికలతో కలిపి మొత్తం 1889 విద్యార్థులకు 3,878 యూనిఫామ్ లు తయారీకి జీవన జ్యోతి మండల సమాఖ్య సభ్యులకు భాధ్యత అప్పగించడం జరిగిందని తెలిపారు. ఈ యూనిఫాంల తయారీ జూన్ 10లోగా అందించాలని, జూన్ 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో జూన్10లోపు బాల, బాలికలకు యూనిఫామ్ లను అందించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. శిక్షణ పొందిన సమాఖ్య మహిళ సభ్యులు విద్యార్థుల కొలతల ఆధారంగా యూనిఫాంలను కుట్టాలన్నారు. యూనిఫామ్ తయారీలో నాణ్యమైన మెటీరియల్ వినియోగించాలని సూచించారు. యూనిఫామ్ ధరించిన పిల్లలు నూతన ఉత్సాహంతో, తేజరిల్లేలా అంత ఖచ్చితంగా విద్యార్థులకు అద్దినట్లు తయారు చేయాలని కలెక్టర్ అన్నారు. పాఠశాలల విద్యార్థుల సంఖ్య ఆధారంగా కొలతలు 5 గురు చొప్పున భిన్నమైన సైజ్ కొలతలు బేరుజు చేసుకొని మరి బిగుతుగా కాకుండా వదులుగా ఉండే విధంగా యూనిఫామ్ లను కుట్టాలని సమాఖ్య సభ్యులకు కలెక్టర్ సూచించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా కాటారం మండలంలోని పోతులవాయి, బయ్యారం గ్రామాల్లో ఎంపీపీఎస్ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్నందున పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డిఓ నరేష్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాబు, ఎంపీఓ ఉపేంద్రయ్య, యూనిఫామ్ కుట్టు శిక్షకురాలు వనిత, జీవన జ్యోతి మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

# మారోజు వీరన్న సిద్ధాంతంతోనే సమసమాజం స్థాపన

## ద్రావిడ సేవా సమితి అధ్యక్షుడు శ్రీకాంతచారి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మార్క్స్ కోరుకున్న వర్గ నిర్మూలన, అంబేద్కర్ కోరుకున్న కుల నిర్మూలనను తన సిద్ధాంతంగా నిర్ణయించుకొని కుల, వర్గ జమిలి పోరాటం చేసిన కామ్రేడ్ మారోజు వీరన్న సిద్ధాంతం,ఆచరణ, పని విధానం ద్వారానే భారతదేశంలో సమసమాజం సాధ్యమవుతుందని ద్రావిడ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది పూసాల శ్రీకాంతాచారి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కేంద్రం నక్కలగుట్ట వివేకానంద పాఠశాలలో న్యాయవాది బండి మొగిలి అధ్యక్షతన జరిగిన మారోజు వీరన్న 25 వర్ధంతికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒక బక్క పలచని అతి సామాన్య వ్యక్తి మారోజు వీరన్న సిద్ధాంతానికి భయపడిన ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వీరన్నను 1999 మే 16న బూటకపు ఎన్కౌంటర్లో కాల్చి చంపాడని, వీరన్న మరణించి 25 ఏండ్లు అయినా ఆయన సిద్ధాంతం తెలంగాణ సమాజంలో ఎన్నో రూపాలలో పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొంగ వీరాస్వామి, ఎంసీపీఐ నాయకుడు గోనే కుమారస్వామి, మాస్ సావిత్రి, తెలంగాణ రైతు సంఘం నాయకులు మోర్తాల చందర్ రావు, అభ్యుదయ రచయితల సంఘం నాయకులు నిది, న్యాయవాదులు కూనూరు రంజిత్ గౌడ్, వేముల రమేష్, మహేందర్, వివిధ సంఘాల నాయకులు ఏదునూరి రాజమౌళి, కేడెల ప్రసాద్, వేణు చారి, రామారావు, దిడ్డి ధనలక్ష్మి, శాగంటి మంజుల, వల్లాల జగన్ గౌడ్, కొమురయ్య, సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.

# వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా ప్రధాన ఆసుపత్రిలోని సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ బానోతు రమేష్ ఆధ్వర్యంలో ఆసుపత్రి సుపరిండెంట్ డాక్టర్ బి శ్రీనివాస్ రావు చేతుల మీదుగా వాల్ పోస్టర్ (ఐఈసీ మెటీరియల్) రిలీజ్ చేశారు. ఎవరు హెచ్ఐవి/ ఎయిడ్స్, సుఖ లైంగిక, హెపటైటిస్ బీసీ బారిన పడకుండా ఉండడం కోసం ఈ పోస్టర్లు ఎంతో దోహదపడుతుందని, సాధారణ జనాలకు నేర్చుకోవడానికి సులభ పద్ధతిలో ఉన్నాయని సూపరిండెంట్ తెలిపారు. ఈ సందర్భంగా సంపూర్ణ సురక్ష కేంద్రం అందిస్తున్న సేవలను వారు అభినందించారు. ఓపీ దగ్గర ప్రతి విభాగంలో ఈ పోస్టర్లను అంటించాలని, ఆసుపత్రిలోని వివిధ విభాగాలు దగ్గర అంటించాలని సూచించారు. జనాలు రద్దీగా ఉండే ప్రాంతాలలో జిల్లాలోని ప్రతి మండలం దవాఖానాలలో అంటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ లకావత్ వెంకట్, అలాగే ఆఫీస్ సూపరిండెంట్ రవి కిషోర్, రామాంజనేయులు, రతీఫ్, శ్రీనివాస్, వివిధ విభాగాల డాక్టర్లు, ఐసీటీసీ కౌన్సిలర్ కుసుమ రమేష్, డీఎస్ఆర్ సీ కౌన్సిలర్ వీరాస్వామి గౌడ్ పాల్గొన్నారు.

# మారోజు వీరన్న కుల వర్గ జమీలి పోరాట సింద్ధాంత కర్త




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని నక్కల గుట్ట వివేకానంద స్కూల్ లో గురువారం మారోజు వీరన్న 25వ వర్ధంతి సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ స్పోక్స్ పర్సన్ వేముల రమేష్, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్, పలువురు ప్రజా సంఘాల నాయకులు, లెఫ్ట్ పార్టీ నాయకులు, ఇండియా కూటమి నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కుల వర్గ జమీలి పోరాట సింద్ధాంత కర్త మారోజు వీరన్న అని గుర్తు చేసి ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ద్రవిడ సేన సమితి రాష్ట్ర అధ్యక్షుడు పూసల శ్రీకాంత్ చారి, న్యాయవాది, ఓబీసీ జాతీయ చైర్మన్ సాయి, నరేందర్, కోనూరు రంజిత్ కుమార్, బండి మొగిలి, ప్రసాద్, రజినీకాంత్, ఈర మహేందర్, ప్రొఫెసర్ సుధాకర్, బీఎల్ఎఫ్ నాయకులు రమాదేవి, సామాజిక కార్యకర్త ఎంసీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# లైసెన్స్ లేకుండా నడిపిన వాహనదారుడికి జరిమానా

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ ఒక్కరికి గురువారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ. 500 జరిమాన విధించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో 13 మందికి రూ.13,900 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. శ్రీధర్ తెలిపారు.

# విశ్వవిద్యాలయ మహిళా కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మధుశ్రీ బాధ్యతలు స్వీకరణ



**వరంగల్ వాయిస్, కేయూ :** విశ్వవిద్యాలయ మహిళా కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ గా గురువారం డా. జి.మధుశ్రీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయ మహిళా కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం కాంట్రాక్టు అధ్యాపకురాలిగా, పరీక్షల విభాగం ఇంచార్జిగా ఆమె పనిచేస్తున్నారు. ఈ బాధ్యతలను గణిత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. బీ.ఎస్.ఎల్ సౌజన్య జి నుంచి స్వీకరించడం జరిగింది. ఎంసీఏ 2009 అల్లూరు ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ అండ్ సైన్స్ నుంచి ఆమె పట్టా పొందారు. ఎంటెక్ లో డిస్టింక్షన్ జేఎన్ టీయూ హెచ్ నుంచి 2010 సంవత్సరంలో పట్టా పొందారు. పీహెచ్డీ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి 2023 సంవత్సరంలో డాక్టరేట్ పట్టా పొందారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ విభాగం లో గత 18 సంవత్సరాలుగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డా .బీఎస్ఎల్ సౌజన్య జి, కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డా. శ్రీధర్ కుమార్ లోతు, హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్ మెంట్ విభాగం అధిపతి డా.చిలువేరు రాజ్ కుమార్, బయోటెక్నాలజీ విభాగాధిపతి డా.మధుకర్ రావు, డా. నాగయ్య, డా. శేషు, డా. కె. భాగ్యలక్ష్మి, డా. కే. కవిత, డా.ఎడెల్లి రవీందర్, డా. వావిళ్ల కుమారస్వామి, డా. జోష్న, శ్రీలత, నహేదా, రజిత, రజని కుమార్, రాజేంద్రప్రసాద్ బోధనతర సిబ్బంది పాల్గొన్నారు.


# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

## కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ లెనిన్ వత్సల్ టొప్పో, అదనపు కలెక్టర్ రెవెన్యూ డేవిడ్ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు.
కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 రబీ సీజన్ లో జిల్లాలో మొత్తం కొనుగోలు కేంద్రాలు 192 ఉండగా అందులో ధాన్యం సేకరణ 102 కొనుగోలు కేంద్రాల ద్వారా 4909 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 24,658 మెట్రిక్ టన్నులు సేకరించడం జరిగిందని, దాని విలువ 54.27 కోట్లు ఉంటుందని అన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని సంబంధిత మిల్లర్లకు రవాణా చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదేశించావాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ధాన్యాన్ని వర్షాలకు తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లను ఉపయోగించాలని అన్నారు. ధాన్యం సేకరణకు తగినన్ని లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్నిసేకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ 2023-24 సంబంధించిన ధాన్యం మిల్లుల ద్వారా మరాడించి బియ్యం త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఆర్డీఓ అలివేలు, తొర్రూరు ఆర్డీఓ నరసింహారావు, డీఎం సివిల్స్ కృష్ణవేణి, డీసీఓ వెంకటేశ్వర్లు, డీఎస్ఓ రాజేందర్, డీఈఓ, మెప్మా విజయ, ఐకేపీ నళిని, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నిందతో వస్తున్న వరుణ్ సందేశ్



కాంద్రకోట మిస్టరీ అంటూ యథార్థ సంఘటనల నేపథ్యంలో తెరకెక్కుతోన్న చిత్రం 'నింద'లో వరుణ్ సందేశ్ హీరోగా నటించారు. ఈ మూవీని రాజేష్ జగన్నాథం నిర్మించడమే కాకుండా కథ, కథనాన్ని రాసి దర్శకత్వం వహించారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ పోస్టర్, ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి స్పందనను రాబట్టుకోగా.. తాజాగా ఈ మూవీ టీజర్‌ను విలక్షణ నటుడు నవీన్ చంద్ర చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. ఇటీవల జరిగిన దాదా సాహెబ్ ఫాల్కే ఫెస్టివల్ అవార్డ్స్‌లో అవార్డును అందుకున్న నవీన్ చంద్ర టీజర్ విడుదల చేసిన అనంతరం చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్ తెలిపారు. టీజర్ బాగుందని టీంను మెచ్చుకున్నారు. సినిమా మంచి విజయం సాధించి టీమ్ అందరికీ మంచి పేరు తీసుకురావాలని కోరారు. టీజర్ విషయానికి వస్తే.. 'జీవితంలో కొన్ని సార్లు తప్పని తెలిసినా చేయక తప్పదు'.. అనే డైలాగ్‌తో మొదలైన ఈ టీజర్‌లో ఎన్నో కోణాలున్నాయి. అందమైన ప్రేమ కథ కనిపిస్తోంది. దాంతో పాటుగా మర్డర్, క్రైమ్ మిస్టరీ కూడా ఉన్నట్టుగా తెలుస్తోంది.




అలాగే టీజర్‌లోని విజువల్స్ కూడా ఎంతో న్యాచురల్‌గా ఉన్నాయి. మరీ ముఖ్యంగా ఆర్ఆర్ అయితే మూడ్‌కు తగ్గట్టుగా సాగింది. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌ను ఫీల్ అయ్యేలా నేపథ్య సంగీతం సాగింది. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని.. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నామని దర్శకనిర్మాత తెలిపారు.

# గాయంతోనే..



అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ఫ్రాన్స్‌లో జరిగే కేన్స్‌కు ప్రత్యేకత ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఎందరో సినీ తారలు ఈ కార్యక్రమంలో పాల్గొని రెడ్ కార్పెట్‌పై సందడి చేస్తుంటారు. ఈ కేన్స్ వేడుకల్లో బాలీవుడ్ స్టార్ హీరోయిన్, మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్యరాయ్ బచ్చన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటారు. విభిన్న కాస్ట్యూమ్స్‌తో అలరిస్తుంటుంది. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు కొత్త కళ తెస్తుంటుంది ఐశ్వర్య. ఆమె రెడ్ కార్పెట్‌పై అలా నడుచుకూంటూ వస్తుంటే కెమెరా కళ్లన్నీ ఐష్ వైపే ఉంటాయి. అయితే, ఈ సారి ఆమె గాయంతోనే కేన్స్‌లో పాల్గొనబోతోంది. గాయం కారణంగా చేతికి కట్టుతోనే కుమార్తెతో కలిసి ఐశ్వర్య ఫ్రాన్స్‌కు పయనమైంది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఫ్రాన్స్ వేదికగా ఏటా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అట్టహాసంగా జరుగుతుందన్న విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన సినీ తారలు, మోడళ్లు, డిజైనర్లు, పలువురు సెలబ్రిటీలు ఈ వేడుకలో పాల్గొని విభిన్న ఫ్యాషన్ దుస్తుల్లో రెడ్ కార్పెట్ పై హొయలుపోతుంటారు. బాలీవుడ్ నుంచి కూడా పలువురు తారలు హాజరై ట్రెండీ దుస్తులు ధరించి అందరినీ ఆకర్షిస్తుంటారు. ఇక ఏటా ఐశ్వర్య ఈ వేడుకలకు కచ్చితంగా హాజరవుతుంటుంది. కొత్త కొత్త కాస్ట్యూమ్స్ ధరించి తళుక్కున మెరిసి ఆకట్టుకుంటుంటుంది. అయితే, ఈ సారి ఆమె గాయంతోనే కేన్స్ వేడుకల్లో సందడి చేసేందుకు సిద్ధమైంది.



# భారతీయుడు 2' ట్రైలర్ కోసం ప్లాన్



కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'భారతీయుడు 2' వీళ్లిద్దరి కాంబినేషన్‌లోనే వచ్చిన హిట్ సినిమా 'భారతీయుడు'కు సీక్వెల్‌గా ఇది రానుంది. తాజాగా దీనికి సంబంధించిన కొన్ని అప్‌డేట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మూడో భాగంపై కూడా వార్తలు వస్తుండడంతో సినీ ప్రియులు సంబర పడుతున్నారు. 'భారతీయుడు 2'తో పాటే మూడో భాగాన్ని కూడా సిద్ధం చేస్తున్నట్లు టీమ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. పార్ట్ 3కు సంబంధించిన షూటింగ్‌ను కూడా శంకర్ కంప్లీట్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ రెండు సినిమాలను ఏడాదిలోపే విడుదల చేయాలని చిత్రబృందం భావిస్తున్నట్లు సమాచారం. 'భారతీయుడు 2' ట్రైలర్ రిలీజ్ కోసం యూనిట్ ఓ భారీ ఈవెంట్‌ను ప్లాన్ చేస్తోందట. ఇప్పటికే పనులు పూర్తయినట్లు టాక్. జూన్‌లో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నట్లు చిత్రబృందం గతంలోనే తెలిపింది. జూన్‌కు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కష్టమని అందుకే దీన్ని జులై 12కు వాయిదా వేసినట్లు టాక్ వినిపిస్తుంది. అన్నిటికంటే ముఖ్యంగా ఈ మూవీ టీమ్ భారీ సర్‌ప్రైజ్‌కు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. పార్ట్2 ÷-లకైమాక్స్‌లోనే మూడో భాగం ట్రైలర్‌ను ప్రదర్శించాలని చూస్తోందట. దానితో పాటే పార్ట్-3 విడుదల తేదీని కూడా ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. 1996లో శంకర్ దర్శకత్వంలో వచ్చి సంచలనం సృష్టించింది 'భారతీయుడు'. సేనాపతి పాత్రలో కమల్ ఆహార్యం, హావభావాలు ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' మరోసారి మ్యాజిక్ చేసేందుకు సిద్ధమైంది. ఇది విడుదలైన వెంటనే మూడో భాగానికి సంబంధించిన నిర్మాణాంతర పనుల్ని మొదలు పెట్టనున్నారు.



# జీవితంలో కొన్ని త్యాగాలు తప్పవు

'జీవితంతో కొన్ని సాధించాలంటే కొన్ని త్యాగాలు చేయాలి, సవాళ్లను ఎదుర్కొవాలి, అలాగే అభిమానులు, ప్రేక్షకులను మెప్పించాలంటే కథానాయికగా బలమైన కథలు ఎంచుకోవాలి. వాటితో ప్రేక్షకులను మెప్పించాలి. అందుకోసం చాలా కష్టపడాలి' అంటున్నారు బాలీవుడ్ యువకథానాయిక జాన్వీకపూర్. 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' చిత్రం కోసం ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని ఆమె చెప్పారు. రాజ్‌కుమార్ రావ్‌తో కలిసి ఆమె నటించిన చిత్రమిది. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కింది. ఈ చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో షూటింగ్ టైమ్‌లో ఎదుర్కొన్న సవాళ్లను గురించి చెప్పుకొచ్చింది. ఈ సినిమా కోసం రేయింబవళ్లు కష్టపడి క్రికెట్ నేర్చుకున్నాను. దర్శకుడు శరణ్ శర్మ ఏ పనిలోనైనా నాణ్యతని కోరుకుంటారు. క్రికెట్ నేపథ్యంలో కథ కాబట్టి నేను తప్పక క్రికెట్ నేర్చుకోవాలని పట్టుబట్టారు. ఎలాంటి వీఎఫ్ఎక్స్ ఉపయోగించకూడదన్నారు. శిక్షణ సమయంలో ఎన్నో దెబ్బలు తగిలాయి. భుజాలు డిస్‌లొకేట్ అయ్యాయి. ఈ చిత్రాన్ని వదిలేద్దామని అనుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. కానీ నేను క్రికెట్ ఆడగలనని నాలో ధైర్యం నింపింది శిక్షకులు అభిషేక్ నాయర్, నాయర్, విక్రాంత్ సర్ మాత్రమే' అని అంది. సినిమా ప్రమోషన్ లో ఆరు నంబరు కలిగిన దుస్తుల్ని మాత్రమే ఎందుకు ధరిస్తున్నారు అన్న ప్రశ్నకు.. 'ఈ సినిమాలో నేను పోషించిన మహిమ పాత్ర క్రికెట్ ఆటలో ఆరు నంబరు గల జెర్సీనే ధరిస్తుంది. ఆమె ధోనీకి వీరాభిమాని. మేము కూడా షూటింగ్ సమయంలో ధోని ధరించే ఏడు నంబరు జెర్సీనే ఉపయోగించాలనుకున్నాం. కానీ ఆ నంబరు ఆయనకు మాత్రమే సొంతం అనుకొని ఆరుని నిర్ణయించాం. అంతేకాదు ఆరు నా లక్కీ నంబరు కూడా. ఈ సినిమాకు కూడా ఆ అదృష్టం కలిసిరావాలని ఆశిస్తున్నా' అని చెప్పారు. జాన్వీ. ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. ప్రస్తుతం జాన్వీ రెండు తెలుగు చిత్రాల్లో కూడా నటిస్తోంది. ఎన్టీఆర్ సరసన 'దేవర', రామ్‌చరణ్, బుచ్చిబాబు సాన కాంబోలో వస్తున్న చిత్రంలోనూ నటిస్తోంది.

# ప్రతీ రోజు స్ట్రాంగ్ రూంలను పరిశీలించాలి

**రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**ఏఆర్ ఓలకు ఆదేశాలు జారీ**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ప్రతీ రోజు స్ట్రాంగ్ రూంలను పరిశీలించాలని పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశాలు జారీ చేశారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్ రూములను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల్లో వినియోగించి భద్రపరిచిన ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి, స్ట్రాంగ్ రూములకు సంబంధించిన లాగ్ బుక్స్, స్ట్రాంగ్ రూమ్ ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పర్యవేక్షణకు సంబంధించిన వాచ్ రూమ్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఏనుమాముల మార్కెట్ యార్డులో స్ట్రాంగ్ రూంలకు పక్కన ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఆయా స్ట్రాంగ్ రూముల సీసీటీవీ కవరేజ్ ఎల్ యీడీ స్క్రీన్ లపై ప్రదర్శిస్తున్నామన్నారు. పారదర్శకంగా, అత్యంత కట్టుదిట్టమైన భద్రతతో జూన్ 4వ తేదీ వరకు ఓట్ల లెక్కింపు జరిగే వరకు దృశ్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు చర్యలు చేపట్టామని సూచించారు. ప్రతిరోజు సహాయ రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్ రూంలను సందర్శించి భద్రత, తదితర అంశాలను పరిశీలించి నివేదించాల్సిందిగా కోరారు. స్ట్రాంగ్ రూం 24 గంటలు సాయుధ బలగాల రక్షణలో ఉంటుందని, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం కంట్రోల్ రూమ్ లో పర్యవేక్షించబడుతుందని అన్నారు. స్ట్రాంగ్ రూములకు సీసీటీవీ కవరేజ్ తో సహా భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించడానికి గెజిటెడ్ స్థాయి అధికారులతో పాటు పోలీస్ అధికారులు 24 గంటలు షిఫ్ట్ ల వారిగా డ్యూటీలో ఉంటారన్నారు. ప్రతి స్ట్రాంగ్ రూంకు ఒక గార్డ్ ఉంటారని, వారిచే లాగ్ బుక్ నిర్వహించబడుతున్నదన్నారు. స్ట్రాంగ్ రూం ఆవరణలోకి ఎవరికి అనుమతి ఉండదని, అభ్యర్థులు వారి తరపున వచ్చే ఏజెంట్ లకు ప్రత్యేక రూం ఏర్పాటు చేసి అక్కడ వరంగల్ పార్లమెంట్ కు చెందిన ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూంల సీసీ పుటేజీలను పెద్ద స్క్రీన్ లు ఏర్పాటు చేసి ప్రదర్శించడం జరుగుతున్నదని తెలిపారు. అభ్యర్థులు వారి ఏజెంట్లు 24 గంటలు అట్టి పుటేజీలను చూడవచ్చన్నారు. పోలీసుల సమక్షంలో ఇన్నర్ పెరిమీటర్ వరకు వారికి అనుమతి ఉంటుందన్నారు. ఇట్టి విషయంలో ఎలాంటి సందేహాలు అవసరం లేదని ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ రంజిత్, పోలీస్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను ఈ నెల 20వ తేదీ నాటికి పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కాజీపేట, హనుమకొండ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చేపడుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, డీఈవో డాక్టర్ అబ్దుల్ హై, ఈఈ లు రాజయ్య, సంజయ్ కుమార్, డీఈలు సంతోష్ బాబు, రవికుమార్, శివానంద్, పలువురు ఏఈలు పాల్గొన్నారు.

**5 కల్లా పనులు పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు జూన్ 5 కల్లా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. గురువారం వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని పలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గీసుకొండ మండలంలోని జాన్ పాక ఎంపీపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాల, గుంటూరు పల్లిలోని ఎంపీపీఎస్ కొమ్మాల అంగడి పాఠశాల, ఎంపీపీఎస్ బీఎస్ పల్లి పాఠశాలలలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట విద్యాశాఖ అధికారి వాసంతి, డీఆర్డీఏ ఏపీఎం రేణుకా దేవి, డీపీఎం భవాని, తహసీల్దార్ రియాజ్, మండల స్పెషల్ అధికారి తదితరులు ఉన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలల.. పనుల్లో వేగం పెంచండి

**బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే**

**ఆదర్శ పాఠశాలల చైర్ పర్సన్స్, హెచ్ ఎం, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో హనుమకొండ జిల్లా పరిధిలోని అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్ పర్సన్లు, ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులతో పనుల పురోగతిపై సమీక్షించారు. పనులు సమర్థవంతంగా నిర్వహించేందుకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఈల వారీగా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సమీక్షిస్తూ పాఠశాలల్లో పెండింగ్ లో ఉన్న మైనర్ పనులను త్వరితంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంకను అభివృద్ధి పనులు ప్రారంభించని పాఠశాలు తక్షణమే పనులు ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం ఇట్టి పనులకు అత్యంత ప్రాధాన్యం కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో ముందస్తుగా 25శాతం నిధులను అందజేసి పనులు పూర్తి చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఇప్పటికీ మైనర్ పనులు పూర్తి చేసిన వారికి బిల్లులు చెల్లించేలా అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. చైర్ పర్సన్ లు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల మధ్య సమన్వయం ఉన్నపుడే పనులు వేగవంతంగా పూర్తి అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్ ఓ కోలా రాజేష్ కుమార్, ఈఈలు రాజయ్య, సంజయ్ కుమార్, డీఈలు రవికుమార్, సంతోష్ బాబు, శివానంద్, అజ్మీరా శ్రీకాంత్, టీఎంసీ రమేష్, ఏఈలు, సీఓలు తదితరులు పాల్గొన్నారు.



# అమ్మవారి సేవలో ఆర్యవైశ్యులు

**ఏడో రోజుకు చేరుకున్న బ్రహ్మోత్సవాలు**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో భద్రకాళీ భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు గురువారం ఏడో రోజుకు చేరుకున్నాయి. అమ్మవారికి ఉదయం నిత్యాహనికం నిర్వహించి చతుస్థానార్చన తర్వాత అమ్మవారికి బలి ఉత్సవం నిర్వహించారు. ఈరోజు ఉభయ దాతలైన వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం వారి ఆహ్వానం మేరకు అనేకమంది ఆర్యవైశ్యులు ఆలయానికి విచ్చేసి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ముందుగా అమ్మవారికి పట్టుబట్టలు, పువ్వులు, పండ్లు అన్ని శిరస్సు మీద ధరించి మేళ తాళాలతో వేదమంత్రాలతో గుడిలోనికి ప్రవేశించి అమ్మవారికి సమర్పించారు. షోడశోపచార పూజ జరిపి అమ్మవారి అనుజ్ఞ మేరకు స్నాపన మండపంలో అభిషేకం నిర్వహించారు. అనంతరం 1000 మంది నారీమణులచే అమ్మవారికి కుంకుమార్చన జరుపించారు. ఆ తరువాత గ్రహమకం, దుర్గా హెూమం, లక్ష్మీ హెూమాదులు నిర్వహించారు. అటు పిమ్మట అమ్మవారికి బలి ఉత్సవం జరిగింది. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు గుండా ప్రకాశరావు ఆధ్వర్యంలో ఈరోజు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన సుమారు 1800 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొనపునూరి వీరన్న, మల్యాల వీరమల్లయ్య, ప్రోగ్రాం కన్వీనర్లు అయిత గోపీనాథ్, నాగేశ్వరరావు, కల్వ నాగరాజు తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఉచిత ప్రసాదం, తాగునీరు అమ్మవారి దర్శనం తదితర ఏర్పాట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శేషు భారతి పర్యవేక్షించారు. సాయంకాలం అమ్మవారికి అర్చనాదులు, సాయం ఔపసన, దీక్ష హెూమం, బలిహరణ జరుపబడిన అనంతరం అమ్మవారిని భద్రకాళి మహా త్రిపుర సుందరిగా అలంకరించి రతసేవ జరిపారు. ఈ రథ సేవలో వందలాదిగా భక్తులు పాల్గొని అమ్మవారి రథం లాగుతూ భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. ఆహ్లాదకరమైన ప్రకృతి సిద్ధమైన వాతావరణంలో అమ్మవారి గుడిలో రథసేవ జరుగుతున్నంత సేపు భద్రకాళి శరణం మమ నామస్మరణతో దేవాలయ ప్రాంగణమంతా మారు మోగింది.

# ఉచిత వేసవి శిక్షణ శిబిరం



**వరంగల్ వాయిస్, సంగెం :** సంగెం మండల కేంద్రంలో మార్గం స్వచ్ఛంద సేవా సొసైటీ వారి ఆధ్వర్యంలో ఒకటవ తరగతి నుంచి పదో తరగతి చదివే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల బాల బాలికలు ఉచిత వేసవి వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ సురేశ్, సింగారపు బాబు తెలిపారు. విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2003 నుంచి ప్రతి ఏటా వేసవిలో ఈ శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. వసతి, ఉచిత భోజనం ఉంటుందన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్, చదువుతోపాటు వ్యక్తిత్వ వికాసం, రంగస్థలం, కోలాటం, నృత్యం, సాంస్కృత కార్యక్రమాలు, ధ్యానం, యోగా, క్రీడలు, క్రికెట్, అంబాకస్, క్యారం, చెస్, తదితర అంశాలపై నిపుణులతో తర్ఫీదు ఇస్తున్నామన్నారు. సంగీతంలో డప్పు, గాత్రం, చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాసం, చేతిరాత, నీతి కథలు వీటితోపాటు గణితం, సైన్స్, తెలుగు, ఇంగ్లీష్, హిందీ, రాయడం, చదవడంతో పాటు విద్యార్థులకు ఇంగ్లీష్ డిక్షనరీలు, ఆల్ ఇన్ వన్ బుక్స్, నోట్ బుక్స్, పెన్నులు, మౌలిక విద్య సామర్థ్యాలు మెరుగుపరచడంపై శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరం విద్యార్థులకు వరం లాంటిదన్నారు. నేటి సమాజంలో విద్యార్థులు చదువుతోపాటు వివిధ అంశాలపై మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఉత్సాహం కలిగిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శిబిరానికి హాజరు కావచ్చున్నారు. వివరాలకు 7801078784, 9951231376 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com